

అట్టహాసంగా..
రాష్ట్రస్థాయి అంతర్ జిల్లా జూనియర్ ఖోఖో పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి.
వివరాలు 10లో ▸



లెక్క తేలుస్తున్న అధికారులు
పీయూలో సామగ్రి లెక్కలు తేల్చే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.
వివరాలు 10లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
38.0 /17.2
ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమై ఉంటుంది. ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. సాయంత్రం చిరు జల్లులు పడొచ్చు.

న్యూస్‌రీల్

15 మంది డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 15 మంది డి**ప్యూటీ కలెక్టర్లు** బదిలీ అయ్యాయి. ఈ మేర**కు సోమవారం** సీసీఎల్‌ఏ ప్రిన్సిపల్ సెక్రటరీ **నవీన్‌మిట్టల్** ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో మహబూబ్‌నగర్ భీమా ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ ముకుందరెడ్డి హైదరాబాద్ అడిషనల్ కలెక్టర్‌గా, వనపర్తి అడిషనల్ కలెక్టర్ నగేష్ మెదక్ అడిషనల్ కలెక్టర్‌గా, మెదక్ అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు వనపర్తి అడిషనల్ కలెక్టర్‌గా బదిలీపై వచ్చారు. యాదాద్రి అడిషనల్ కలెక్టర్ బెన్ సలేమ్ నారాయపేట అడిషనల్ కలెక్టర్‌గా, షాద్‌నగర్ ఆర్డీఓ వెంకటమాదవ్ మహబూబాబాద్ డీఆర్‌ఓగా, ఖమ్మం అడిషనల్ కలెక్టర్ మధుసూదన్‌నాయక్ మహబూబ్‌నగర్ భీమా ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్‌గా, హైదరాబాద్ ఆర్డీఓ సీత షాద్‌నగర్ ఆర్డీఓగా, నల్లగొండ ఆర్డీఓ సుబ్రమణ్యం, వనపర్తి ఆర్డీఓగా, గద్వాల ఆర్డీఓ రామచందర్ నారాయణపేట ఆర్డీఓగా, వెయిటింగ్‌లో ఉన్న శ్రీనివాసరావు గద్వాల ఆర్డీఓగా, మహబూబ్‌నగర్ స్పెషల్ కలెక్టర్ రాంరెడ్డి జహీరాబాద్ ఆర్డీగా వెళ్లారు. అలాగే గజ్వేల్ ఆర్డీఓ బంసీలాల్ కొల్లాపూర్ ఆర్డీఓగా, నారాయణపేట ఆర్డీఓ మధుమోహన్ ల్యాండ్ అక్విజేషన్ వనపర్తి జిల్లాకు, వనపర్తి ఆర్డీఓ పద్మావతి నారాయణపేట ల్యాండ్ అక్విజేషన్ స్పెషల్ కలెక్టర్‌గా, వనపర్తి ల్యాండ్ అక్విజేషన్ స్పెషల్ కలెక్టర్ సీహెచ్ వెంకటేశ్వర్లు భూపాలపల్లి ల్యాండ్ అక్విజేషన్ స్పెషల్ కలెక్టర్లుగా బదిలీపై వెళ్లారు.

నేడు పాలమూరుకు రామయంత్ర రథయాత్ర

స్టేషన్ మహబూబ్‌నగర్: అయోధ్య రామాలయంలో త్వరలో ప్రతిష్ఠించనున్న రామయంత్ర రథయాత్ర మంగళవారం పాలమూరుకు చేరుకోనుంది. కంచి నుంచి అయోధ్య వరకు దాదాపు 2 వేల కిలోమీటర్లు రామయంత్ర రథయాత్ర నిర్వహిస్తున్నారని, ఈ మేరకు జిల్లాకేంద్రానికి చేరుకుంటుంది. పాతపాలమూరు శివ రామాంజనేయస్వామి దేవాలయం వద్ద సాయంత్రం 5గంటలకు యంత్రాన్ని వేదఘోష నామస్మరణతో, మంగళవాయిద్యాల మధ్య స్వాగతం పలికి అక్కడి నుంచి వన్‌టౌన్ చౌరస్తా, బ్రాహ్మణవాడి వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయం, రాంమందిర్ చౌరస్తా, పాన్ చౌరస్తా, క్లాక్‌టవర్, అశోక్ టాకీస్ చౌరస్తా మీదుగా పిల్లలమర్రి రోడ్డులోని వెంకటేశ్వర దేవాలయానికి చేరుకుంటుందని విశ్వహిందూ పరిషత్, శ్రీ వెంకటేశ్వర సేవామండలి, కంచి కామకోటి పీఠం పాలమూరుశాఖ తెలిపింది.

ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా డాక్టర్ రాంమోహన్

పాలమూరు: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జిల్లాకు చెందిన డాక్టర్ రాంమోహన్ ఎంపికయ్యారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో రాష్ట్ర నూతన ఐఎంఏ కార్యవర్గం ఎన్నుకున్నారు. ఇందులో జిల్లా వైద్యుడికి ప్రాధాన్యత కల్పించారు. రాంమోహన్ ప్రస్తుతం జిల్లా ఐఎంఏ అధ్యక్షుడిగా సైతం కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కార్యవర్గంలో చోటు కల్పించడం సంతోషకరమన్నారు. ఉమ్మడి జిల్లాలో వైద్యుల సమస్యలపై పోరాటం చేయడంతో పాటు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

4న యోగా ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని స్టేడియం మైదానంలో వచ్చేనెల 4వ తేదీన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లాస్థాయి అండర్-14, అండర్-17 విభాగాల బాలబాలికల యోగా ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వివరాల కోసం బాల్‌రాజు 94402 92044 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

6న ఉమ్మడి జిల్లా రగ్బీ ఎంపికలు

జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో వచ్చేనెల 6వ తేదీన ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్-14, అండర్-17 రగ్బీ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు శారదాబాయి తెలిపారు. పాఠశాల బోనఫైడ్, ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో ఉదయం 9 గంటలకు హాజరుకావాలని, మిగతా వివరాల కోసం నిరంజన్‌రావు 89191 93768 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

మాఫీ.. వర్తించలేదయ..!

'దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించట్లేదు' అన్న చందంగా తయారైంది రైతుల పరిస్థితి. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రుణమాఫీ అమలు చేసినా.. సాంకేతిక కారణాలతో వేలాది మందికి అందని ద్రాక్షగా మారింది. తమ బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ కాకపోవడంతో వారు నెలలు దాటినా బ్యాంకర్లు, వ్యవసాయాధికారుల చుట్టూ నిత్య ప్రదక్షిణలు చేస్తున్నారు. మరోవైపు రూ.2 లక్షలకు పైబడి వ్యవసాయ పంట రుణాలు తీసుకున్న రైతులకు రుణమాఫీ వర్తింపజేస్తామని.. ఈ మేరకు మార్గదర్శకాలు రూపొందిస్తున్నామన్న ప్రభుత్వ పెద్దల మాటలు కార్యరూపం దాల్చలేదు. అంతేకాదు రూ.2 లక్షల్లోపు పంట రుణాలు తీసుకున్న వారిలో అర్హులై ఉండి.. రాని వారు ఉంటే వారికి సైతం వర్తింపజేస్తామన్న హామీ అమలుకు నోచుకోకపోవడంతో రైతాంగంలో నిరాశ నిస్పృహలు అలుముకున్నాయి.

- సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

రుణమాఫీకి ఎదురుచూపులు



- మాఫీ అయినా పలువురు రైతుల ఖాతాల్లో జమ కాని సొమ్ము
- సాంకేతిక కారణాలతో పెండింగ్.. ఫిర్యాదులకే పరిమితం
- ఉమ్మడి జిల్లాలో సుమారు 30 వేల మంది బాధితులు
- నెలల తరబడి బ్యాంకర్లు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు
- రూ.2 లక్షల పైబడి మాఫీపై అన్నదాతలకు తప్పని ఎదురుచూపులు
- గైడ్‌లైన్స్ రాలేదని చెబుతున్న అధికారులు

డీసీసీబీ పరిధిలోనే అధికం..

ఉమ్మడి మహబూబ్‌నగర్‌లోని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ పరిధిలో 22 బ్రాంచ్‌లకు సంబంధించి 67,011 మంది రైతులకు రూ.441.53 కోట్ల రుణ మాఫీ అయింది. ఇందులో 32,849 మంది రైతులకు జమ కావాల్సిన రూ.206.19 కోట్లు సాంకేతిక కారణాలతో పెండింగ్‌లో ఉన్నాయి.

ఫిర్యాదులకే పరిమితం.. ముందుకు సాగని ప్రక్రియ

ప్రభుత్వం రుణమాఫీ అమలు చేసిన సమయంలో సాంకేతిక కారణాలతో మాఫీ సొమ్ము జమకాని వారితో పాటు అర్హులై ఉండి మాఫీ జాబితాలో పేర్లు లేని వారు ఫిర్యాదు చేసేందుకు గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇప్పటివరకు వేలాది మంది ఫిర్యాదు చేశారు. కానీ.. ఏ ఒక్కరి సమస్య పరిష్కారం కాలేదని తెలుస్తోంది. అధికారులు పరిశీలనకే పరిమితం కాగా.. రూ.2 లక్షలకు సంబంధించి ప్రభుత్వం నుంచి తమకెలాంటి ఆదేశాలు రాలేదని.. వచ్చిన తర్వాత చెబుతామని వారు తప్పించుకునే పరిస్థితులు నెలకొన్నాయి.

గ్రౌండ్ రిపోర్ట్

3 విడతల్లో చేసిన రుణమాఫీ వివరాలు..

జిల్లా	రైతులు	రుణమాఫీ (రూ.కోట్లలో)
మహబూబ్‌నగర్	77,845	612.16
నారాయణపేట	56,825	487.77
నాగర్‌కర్నూల్	99,337	833.03
జోగులాంబ గద్వాల	51,188	440.73
వనపర్తి	54,982	433.49
మొత్తం	3,40,177	2,807.18

గ్రీవెన్స్ సెల్‌కు వచ్చిన ఫిర్యాదులు..



ఎదురుచూస్తున్నది వీరే..

రూ.2 లక్షల లోపు రుణమాఫీ అర్హుల జాబితాలో ఉండి.. సాంకేతిక కారణాలతో బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమకాని వారు ఉమ్మడి జిల్లాలో 26,707 మంది ఉన్నారు. వీరిలో వెయ్యి లోపు మాత్రమే ప్రస్తుతం ప్రాసెస్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ఆధార్, లోన్ అకౌంట్లకు పేరు సరిపోలకపోవడం, ఆధార్ నంబర్ కరెక్ట్ లేకపోవడం, ఫ్యామిలీ గ్రూప్‌లో వేరే వారి పేరు చేరడం, ఇంట్లో ప్రభుత్వ ఉద్యోగి ఉండడం, పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌లో పేరు సరిపోలకపోవడం, రేషన్‌కార్డు లేకపోవడం, లోన్ తీసుకున్న తేదీ నిబంధనలకు అనుగుణంగా లేకపోవడం, పుట్టిన తేదీ సరిపోలకపోవడం, లోన్ తీసుకున్న రైతు చనిపోవడం, లోన్ అకౌంట్ నంబర్లు పలువురు రైతులకు ఒకటే ఉండడం వంటి సాంకేతిక కారణాలతో వారికి మాఫీ కాలేదు. వీరందరూ ఇప్పటికీ అధికారులు, బ్యాంకర్ల చుట్టూ తిరుగుతున్నారు.

30 వేల మంది ఎదురుచూపులు..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు విడతల్లో రూ.2 లక్షల లోపు వ్యవసాయ పంట రుణాలు మాఫీ చేసిన విషయం తెలిసిందే. ఇచ్చిన హామీ మేరకు ఆగస్టు 15వ తేదీ వరకు ప్రక్రియ పూర్తి చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి.. నిర్ణీత తేదీలోపు రుణమాఫీ నిధులను బ్యాంకుల్లో జమ చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. నిబంధనల కొర్రీలు, ఇతరత్రా కారణాలతో అర్హులైనప్పటికీ వేలాది మందికి రుణమాఫీ వర్తించలేదు. మరోవైపు అర్హుల జాబితాలో ఉండి.. నిధులు విడుదలైనా.. పలు సాంకేతిక కారణాలతో ఉమ్మడి జిల్లాలో సుమారు 30 వేల మంది రైతులు రుణమాఫీకి దూరంగా ఉన్నారు. రెండున్నర నెలలుగా ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్నారు.

ఆందోళన బాటకు సన్నాహాలు..

రుణమాఫీ పూర్తిస్థాయిలో కాకపోవడం.. రైతు భరోసాపై కూడా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఎండాకాలం సాగుకు సమాయత్తమవుతున్న క్రమంలో పెట్టుబడి సాయం కోసం ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో రైతు సంఘాలు రైతుల్లో భరోసా కల్పించేందుకు పోరుబాటకు శ్రీకారం చుడుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల గద్వాలలో పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలి, రైతు భరోసా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నడిగడ్డ పోరాట హక్కుల సమితి ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. దీంతో పాటు కలెక్టరేట్‌ను ముట్టడించి అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు రాజకీయ పార్టీలు సైతం రుణమాఫీ, రైతు భరోసా ఆసరాగా ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. రూ.2 లక్షల పైబడి రుణమాఫీపై ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేలా వారు తగిన కసరత్తు చేపడుతున్నట్లు తెలిసింది.

జాబితాలో పేరుంది.. కానీ డబ్బులు రాలేదు



మూడున్నర ఎకరాల పొలం ఉంది. దీని మీద మూడేళ్ల క్రితం రూ.1.60 లక్షల రుణం తీసుకున్నా. ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించిన తర్వాత మూడో విడత రుణమాఫీ జాబితాలో మాఫీ అయినట్లు పేరు వచ్చింది. తీరా బ్యాంకు వెళితే డబ్బులు రాలేదన్నారు. సమస్య ఏంటని అడిగితే మాకెలాంటి సమాచారం, సంబంధం లేదని బ్యాంకు వారు చెప్పారు. వ్యవసాయాధికారిని అడిగితే ఆధార్ కార్డు జిరాక్స్ ఇవ్వమన్నారు. దీంతో పాటు ఫొటో కూడా తీసుకున్నారు. దాదాపు రెండు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు మాఫీ రాలేదు.

- రాంచంద్రారెడ్డి, రైతు, గండేడ్

మాఫీ ఊసే లేదు..



మహమ్మదాబాద్‌లో ఆరు ఎకరాల పొలం ఉంది. గతేడాది 2.40 లక్షల రూపాయల పంట రుణం తీసుకున్నా. రెగ్యులర్‌గా రెన్యూవల్ చేస్తూ వచ్చారు. రెండు లక్షల వరకు రుణమాఫీలో పేరు రాలేదు. రెండు లక్షల పైనున్న డబ్బులు కట్టమని చెప్పడం లేదు. రుణమాఫీ అవుతుందా.. కాదా అనే సమాచారం ఇవ్వడం లేదు. పైనున్న 40 వేల రూపాయలు, వడ్డీ కట్టడానికి సిద్ధంగా ఉన్నాం. దానికి సంబంధించి ఊసేలేదు. వ్యవసాయశాఖ కూడా ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదు. అసలు రెండు లక్షల వరకు రుణమాఫీ వస్తుందో లేదో తెలియదు. అంతా అయోమయంగా ఉంది. *- చింతకింది అంజిలయ్య, రైతు, మహమ్మదాబాద్*

బ్యాంకుకు తిప్పుతున్నారు..



ఊట్కూర్ ఎస్‌బీఐలో నా పేరిట రూ.1.50 లక్షలు, నా భార్య భీమమ్మ పేరిట రూ.75 వేలు బ్యాంకులో అప్పు ఉంది. ప్రభుత్వం రూ.2 లక్షల వరకు మాఫీ చేస్తామని చెప్పింది. బ్యాంకుకు వెళ్లి అధికారులను అడిగితే అప్పుడు.. ఇప్పుడు అంటూ బ్యాంకు చుట్టూ తిప్పుతున్నారు. ప్రభుత్వం వెంటనే రూ.2 లక్షల రుణమాఫీ చేయాలి.

- కురువ ఆశప్ప, రైతు, ఊట్కూర్ మండలం, నారాయణపేట

ఒక్కరూపాయి కాలేదు..



తెలకపల్లిలోని గ్రామీణ వికాస్ బ్యాంకులో రూ.1.50 లక్షలు నా పేరుమీద, రూ.లక్ష నా భార్య పేరుమీద క్రాప్‌లోన్ ఉంది. కానీ, నాకు, నా భార్యకు ఒక్క రూపాయి కూడా రుణమాఫీ కాలేదు. దీనికోసం వ్యవసాయ అధికారులకు దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేదు. ప్రభుత్వం ఇప్పటికైనా రుణమాఫీ చేసి ఆదుకోవాలి.

- రాములు, రైతు, గౌరారం, తెలకపల్లి మండలం, నాగర్‌కర్నూల్

ప్రజా ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇవ్వాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర, అదనపు కలెక్టర్లు శివేంద్ర, మోహన్‌రావు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ విజయేందిర అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్‌హాల్‌లో ప్రజల నుంచి ఆమె ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిన చేసి ప్రజాసమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో ఎక్కువగా డబుల్ బెడ్‌రూం ఇళ్లు సర్వే ల్యాండ్ రికార్డ్స్, పింఛన్ల మంజూరు, ఆగిపోయిన పెన్షన్ రెన్యూవల్, విద్యాశాఖ చెందిన దరఖాస్తులు ఉన్నాయి. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ మంత్రులు, ప్రజాప్రతినిధులు నుంచి వచ్చిన లేఖలను వెంటనే జవాబు ఇవ్వాలని సూచించారు. నవంబర్ మొదటి వారంలో నిర్వహించనున్న సాంఘిక, ఆర్థిక సర్వేకు సంబంధించి 2,000 మంది సిబ్బంది ఎన్యుమరేటర్‌లు, సూపర్‌వైజర్ల అవసరం ఉంటుందని, ఇందుకోసం అన్ని శాఖలు మండలస్థాయి వరకు సిబ్బంది వివరాలు వెంటనే అందజేయాలన్నారు. సోమవారం జిల్లా నుంచి ఏడుగురు మాస్టర్ ట్రైనర్లు హైదరాబాద్‌లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. 51 మందిని జిల్లా ట్రైనర్‌లు, మండలాలకు ముగ్గురు చొప్పున ఈ నెల 29న శిక్షణ ఉంటుందని తెలిపారు. 150 ఇళ్లకు ఒక ఎన్యుమరేషన్ బ్లాక్‌గా విభజించి ఒక్కొక్క బ్లాక్‌కు ఎన్యుమరేటర్, 10 బ్లాక్‌లకు ఒక సూపర్ వైజర్‌లను నియమించనున్నట్లు సూచించారు. ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మండలాలకు ప్రత్యేక అధికారులుగా ఉన్న జిల్లా అధికారులు పర్యవేక్షణ చేస్తారని వివరించారు. సర్వేను 10 రోజుల్లో పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. సబ్‌సెంటర్ల నిర్మాణం, పంచాయతీ భవనాల నిర్మాణానికి సంబంధించి భూ సమస్యల ఉన్న గ్రామాల వివరాలు రెవెన్యూ అదనపు కలెక్టర్లకు అందజేయాలని పంచాయతీ రాజ్ ఈఈ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారికి సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు, తేమయంత్రాలు, ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు, టార్పలిన్‌లు సరిపడే సరఫరా చేయాలన్నారు. కలెక్టరేట్‌లో ప్రజావాణికి మొత్తం 91 వినతులు, ఫిర్యాదులు వచ్చాయి. సమావేశంలో అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, మోహన్‌రావు, డీఆర్‌డీఓ నర్సిములు, ఆర్‌డీఓ నవీన్ పాల్గొన్నారు.

123 బాణసంచా దుకాణాలకు అనుమతులు

- నిబంధనలు కచ్చితంగా పాటించాలి: డీఎఫ్‌ఓ

మహబూబ్‌నగర్ క్రైం: దీపావళి సందర్భంగా మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో కలిపి 123 తాత్కాలిక బాణసంచా దుకాణాలకు అనుమతులు ఇచ్చామని, తాత్కాలిక లైసెన్స్‌దారులకు ఇప్పటికే దుకాణాల నిర్వహణపై ప్రత్యేక నిబంధనలు, సూచనలు ఇచ్చినట్లు జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి కిషోర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన దుకాణాదారులకు సోమవారం డీఎఫ్‌ఓ ప్రత్యేక అవగాహన నిర్వహించారు. మహబూబ్‌నగర్ పట్టణంలో 65, జడ్చర్ల 10, హన్వాడలో ఒకటి, మిడ్జిల్‌లో ఒకటి, నారాయణపేట జిల్లాలో 46 తాత్కాలిక దుకాణాల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. దుకాణదారులు కచ్చితంగా నిబంధనలు పాటించాలని, ఒక్కో దుకాణానికి మధ్య మూడు మీటర్ల దూరం ఉండాలని, రేకులతో మాత్రమే దుకాణం ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి దుకాణం దగ్గర రెండు డ్రమ్ముల నీరు, ఎక్స్‌టింగ్‌విషన్, ఇసుక బకెట్లు, నో-స్మోకింగ్ బోర్డులు, బయటి నుంచి వేరుగా విద్యుత్ తీగాలు తీసుకోవాలని సూచించారు. దుకాణాలలో విక్రయాలు చేసే సమయాల్లో చాలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిత్యం అగ్నిమాపక శాఖ సిబ్బంది దుకాణాలపై పర్యవేక్షణ కొనసాగుతుందన్నారు.

బాలలను పనిలో పెట్టుకుంటే కఠిన శిక్షలు

- పిల్లలకు తల్లిదండ్రులు ఉజ్వల భవిష్యత్ ఇవ్వాలి: న్యాయమూర్తి డి.ఇందిర

పాలమూరు: పాన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా బాలకార్మికుల వ్యవస్థ నిర్మూలన కోసం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో నవంబర్ 20 వరకు జిల్లాలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి డి.ఇందిర అన్నారు. మండలపరిధిలోని ఓబులాయిపల్లిలో ఉన్న వృద్ధ ఆశ్రమాన్ని సోమవారం న్యాయమూర్తి సందర్శించారు. ఆశ్రమ ఆవరణంతో పాటు స్థానికంగా ఉన్న సౌకర్యాలు భోజనం, తాగునీరు ఇతర వసతులు పరిశీలించారు. అక్కడ ఉన్న వృద్ధులను యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వృద్ధులకు సరైన భోజనం, కావాల్సిన వైద్యం అందించాలని సూచించారు. సమయానికి నీరు, భోజనం ఇవ్వడంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా పెట్టుకోవాలన్నారు.

■ మహబూబ్‌నగర్ మండల పరిధిలోని రాంరెడ్డి గూడెంలో ఉన్న ప్రభుత్వ గురుకుల బాలికల పాఠశాలలో సోమవారం కార్మిక బాలలపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ కొందరు పలు రకాల పారిశ్రామిక యాజమానులు పిల్లలను బలవంతంగా చదువు మాన్పించి పనిలో పెట్టుకొని హింసిస్తున్నారన్నారు. కొందరికి డ్రగ్స్ ఇచ్చి ఇతర దేశాలకు విక్రయాలు జరిపి అక్కడి పరిశ్రమల్లో దినసరి కూలీలుగా పెట్టుకుంటున్నారని, మరి కొందరుపిల్లలతో నేరాలు చేయిస్తూ నేరస్తులుగా మారుస్తున్నారని తెలిపారు. బాలకార్మిక వ్యవస్థ పోవాలంటే ప్రతి ఒక్కరూ ఉన్నతంగా చదువుకోవాలని, గ్రామాల్లో తల్లిదండ్రులకు అవగాహన పెరగాలన్నారు. బాలలను అన్ని రంగాల్లో రాణించే విధంగా ప్రోత్సహిస్తూ రేపటి పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. బాలబాలికలను ఎవరైనా పనిలో పెట్టుకుంటే వారికి కఠిన శిక్షలు ఉంటాయని తెలిపారు.

కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి



పీయూ వీసీ శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇస్తున్న పీయూ కాంట్రాక్టు అధ్యాపకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వీసీ జీఎన్ శ్రీనివాస్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ అధ్యాపకులు అరకొర వేతనాలతో విధులు నిర్వహిస్తున్నారని, బోధనతో పాటు అనేక అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగ భద్రతతో కూడిన 7వ పీఆర్సీని ఇప్పించాలని, నెట్, సెట్, పీహెచ్‌డీలు ఉన్నప్పటికి ప్రభుత్వం క్రమబద్ధీకరించలేదని, కనీసం పీఆర్సీ అయినా ఇప్పించాలని కోరారు. వీసీ శ్రీనివాస్ మాట్లాడుతూ అధ్యాపకుల సమస్యలపై అవగాహన ఉందని, తన పరిధిలో ఉన్న సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తామన్నారు. కోర్సులను సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల నుంచి రెగ్యులర్ కోర్సులుగా మార్చి పోస్టులు మంజూరు చేయిస్తామన్నారు. ఆర్థికపరమైన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. అధ్యాపకులు భూమయ్య, అర్జున్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, రవికుమార్, పర్వతాలు, ప్రభాకర్‌రెడ్డి, మాధురిమోహన్, చిన్నాదేవి, సుస్మిత, సుజాత పాల్గొన్నారు.

మృతి చెందిన ఉద్యోగి పేరుపై.. రూ.28 లక్షల పింఛన్ స్వాహా?

- రూ.10 లక్షల బెనిఫిట్స్ మింగేసిన వైనం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక మున్సిపాలిటీలో పబ్లిక్ హెల్త్ వర్కర్ (పీహెచ్‌డబ్ల్యూ)గా పనిచేస్తున్న ఓ వ్యక్తి సుమారు 13 ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈయనకు భార్య నాగమ్మ ఉన్నారు. అయితే ఆమెకు ఎలాంటి సంబంధం లేని మరో మహిళ నర్సమ్మ రికార్డులో ఫోర్జరీ పత్రాలు సృష్టించి పింఛను కింద ఇప్పటివరకు సుమారు రూ.28 లక్షలు స్వాహా చేసినట్టు సమాచారం. చనిపోయిన ఉద్యోగికి వారసులుగా భార్య నాగమ్మను కాదని మరో వ్యక్తికి ఉద్యోగం సైతం ఇచ్చారు. ఈ తతంగమంతా ప్రస్తుతం మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో ఆర్‌ఓగా పనిచేస్తున్న మహమ్మద్ ఖాజా (అప్పటి సీనియర్ అసిస్టెంట్), ఆత్మకూరు కమిషనర్‌గా పనిచేస్తున్న సి.శశిధర్ (అప్పటి ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్‌లో జూనియర్ అసిస్టెంట్), సిద్దిపేట మున్సిపాలిటీలో మేనేజర్‌గా పనిచేస్తున్న ఉమేందర్‌సింగ్ (సీనియర్ అసిస్టెంట్) కలిసి నడిపినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి ఆలస్యంగా సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ఈ కేసు ఎవరి మెడకు చుట్టుకుంటుందోనని మున్సిపల్ అధికారులు, సిబ్బంది గుబులు చెందుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్ రెడ్డిని వివరణ కోరగా పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై తగు చర్యలు తీసుకుంటామన్నారు.

బాదేపల్లి మార్కెట్‌కు పోటెత్తిన మొక్కజొన్న



బాదేపల్లి మార్కెట్‌కు వచ్చిన మొక్కజొన్న

జడ్చర్ల/దేవరకద్ర: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డుకు సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భారీగా మొక్కజొన్న విక్రయానికి వచ్చింది. 7011 క్వింటాళ్ల మొక్కజొన్న మార్కెట్‌కు రావడంతో యార్డు ఆవరణ కిక్కిరిసిపోయింది. ఈ సీజన్‌లో ఇంత పెద్ద మొత్తంలో పంట రావడంతో ఇదే మొదటిసారి అని అధికారులు తెలిపారు. క్వింటాల్ గరిష్టంగా రూ.2,513, కనిష్టంగా రూ.1,500 ధరలు లభించాయి. అదేవిధంగా ధాన్యం హంస రకం రూ.2,116, ఆర్‌ఎన్‌ఆర్ రకం రూ.2,322, సోనామసూరి రూ.1,721, రాగులు రూ.2,210 ధరలు పలికాయి.

■ దేవరకద్ర మార్కెట్ యార్డులో సోమవారం జరిగిన టెండర్లలో ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యం ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2,301, కనిష్టంగా రూ.2,009గా ధరలు నమోదయ్యాయి. హంస ధాన్యం ధర గరిష్టంగా రూ.2,050, కనిష్టంగా రూ.1,854గా పలికాయి. సీజన్ ప్రారంభం కావడంతో మార్కెట్‌కు రెండు వేల బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది.

లక్ష్యానికి మించి విద్యుదుత్పత్తి



ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి కొనసాగుతోందని జెన్‌కో సివిల్, ఎలక్ట్రికల్ ఎస్‌ఈలు సురేశ్, సూరిబాబు సోమవారం తెలిపారు. ఈ ఏడాది రెండింటిలో కలిపి 620 మి.యూ. ఉత్పత్తి లక్ష్యం కాగా.. ఇప్పటి వరకు 627 మి.యూ. చేపట్టి అధిగమించామని చెప్పారు. ఎగువ నుంచి వరద వస్తుండటంతో నిర్విరామంగా ఉత్పత్తి కొనసాగుతుందన్నారు. ఎగువలో 330 మి.యూ. లక్ష్యానికిగాను 321 మి.యూ చేపట్టగా ఇంకా 9 మి.యూ. మిగిలిందని మరో రెండ్రోజుల్లో పూర్తి చేస్తామని వివరించారు. అలాగే దిగువలో 290 మి.యూ.గాను 305.838 మి.యూ. చేపట్టి లక్ష్యాన్ని అధిగమించామన్నారు. సోమవారం ఎగువలో 4 యూనిట్ల నుంచి 156 మెగావాట్లు, దిగువలో 4 యూనిట్ల నుంచి 160 మెగావాట్లు ఉత్పత్తి జరిగిందని తెలిపారు. ఇప్పటి వరకు 627.621 మి.యూ. విద్యుదుత్పత్తి సాధించామని.. 30,559 వేల క్యూసెక్కులను వినియోగించి దిగువ శ్రీశైలానికి నీటిని వదులుతున్నామని చెప్పారు. డీఈలు పవన్‌కుమార్, రాజు, రూపేష్, ఈఈ దర్బార్‌వలీ, సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి


ఆంజనేయులుగౌడ్ (ఫైల్)

మహమ్మదాబాద్: చేపల వేటకు వెళ్లి ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు మృతిచెందిన ఘటన గండీడ్ మండలం వెన్నాచేడ్‌లో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. వెన్నాచేడ్‌కు చెందిన మన్సూర్‌పల్లి ఆంజనేయులుగౌడ్ (45) మూడు రోజుల క్రితం రాత్రివేళ చేపలు పట్టేందుకు గ్రామ సమీపంలోని చెరువుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. కుటుంబ సభ్యులు అతడి కోసం గాలించినప్పటికీ ఫలితం లేకపోయింది. సోమవారం చెరువులో అతడి మృతదేహం లభ్యమైంది. మృతుడికి తల్లి సత్యమ్మ, భార్య లక్ష్మి, కూతుళ్లు అక్షర, అక్షిత ఉన్నారు. సత్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, వెన్నాచేడ్ పెద్ద చెరువు అలుగు పారినప్పుడల్లా ఎవరో ఒకరు మృతి చెందుతున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తంచేశారు.

ఆర్టీసీ బస్సు, బైకు ఢీ : వ్యక్తి దుర్మరణం

మల్దకల్: ఆర్టీసీ బస్సు, మోటార్ సైకిల్ ఎదురెదురుగా ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన సోమవారం మల్దకల్ సమీపంలోని రైస్‌మిల్లు వద్ద చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. సద్దలోనిపల్లికి చెందిన కుర్వ ఊరబావి సట్టల రాముడు(38) తన మోటార్ సైకిల్‌పై సొంత పనుల నిమిత్తం మల్దకల్ వెళ్లి పనులు ముగించుకొని స్వగ్రామానికి తిరిగి వస్తుండగా గద్వాల నుంచి అయిజకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు మల్దకల్ సమీపంలోని రైస్‌మిల్లు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రాముడుకి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు వెంటనే 108లో గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రెఫర్ చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఆర్టీసీ బస్సు డ్రైవర్ మోహన్‌గౌడ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ గోపాల్ నాయక్ తెలిపారు.

విద్యుదాఘాతానికి వ్యక్తి బలి


బాచారం శ్రీను (ఫైల్)

పెద్దకొత్తపల్లి: మండలంలోని సాతాపూర్‌కు చెందిన బాచారం శ్రీను (45) విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందినట్లు ఎస్‌ఐ సతీశ్ తెలిపారు. సోమవారం సాయంత్రం గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తీగలను సరి చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడని వివరించారు. భార్య శివలీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు చెప్పారు. శ్రీనుకు కుమారుడు వంశీ, కుమార్తెలు జ్యోతి, కావేరి ఉన్నారు.

దాడిచేసిన వ్యక్తికి జైలుశిక్ష

గోపాల్‌పేట: భూతగాదాలో దాడికి పాల్పడిన వ్యక్తికి సోమవారం వనపర్తి సెకండ్ అడిషనల్ జడ్జి సంవత్సరం జైలుశిక్ష విధించినట్లు ఎస్‌ఐ నరేష్‌కుమార్ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. 2021లో గోపాల్‌పేటకు చెందిన బత్తుల నాగశేషిని పొలం వద్ద అదే గ్రామానికి చెందిన చిన్నబుచ్చన్న దాడికి పాల్పడటంతో రక్తగాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పట్లో కేసు నమోదైంది. కోర్టులో వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో చిన్నబుచ్చన్నకు సంవత్సరం జైలుశిక్ష, రూ. 500 జరిమానా విధిస్తూ వనపర్తి సెకండ్ అడిషనల్ జడ్జి తీర్పు ఇచ్చారని ఎస్‌ఐ తెలిపారు.


మార్చ్‌పాస్ట్‌లో పాల్గొన్న మహబూబ్‌నగర్ జట్టు


టోర్నీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న రాష్ట్రంలోని వివిధ ఉమ్మడి జిల్లాల జట్లు

అట్టహాసంగా..

రాష్ట్రస్థాయి ఖోఖో టోర్నీ ప్రారంభం


బాలికల మహబూబ్‌నగర్- మెదక్ జట్ల మధ్య ఖోఖో మ్యాచ్

- హాజరైన ఉమ్మడి పది జిల్లాల జట్లు
- ఆకట్టుకున్న క్రీడాకారుల మార్చ్‌పాస్ట్

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో సోమవారం రాష్ట్రస్థాయి అంతర్ జిల్లా జూనియర్ ఖోఖో చాంపియన్‌షిప్ అట్టహాసంగా ప్రారంభమైంది. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, డీవైఎస్‌ఓ శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. ఆయా జిల్లాల క్రీడాకారుల మార్చ్‌పాస్ట్ ఆకట్టుకుంది. అనంతరం అతిథులు క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

రాష్ట్రంలో క్రీడలకు పెద్దపీట

రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తున్నట్లు ఎన్‌పీ వెంకటేశ్ అన్నారు. గత ప్రభుత్వం క్రీడలను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. తెలంగాణ క్రీడల్లో ఉన్నత స్థానంలో ఉండాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశారన్నారు. క్రీడా అవకాశాలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకొని జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. రాబోయే పదేళ్లలో క్రీడాకారులకు మెరుగైన అవకాశాలు లభిస్తాయన్నారు. డీవైఎస్‌ఓ శ్రీనివాస్ మాట్లాడుతూ నేను మొదట్లో ఖోఖో ఆడి బాక్సింగ్ క్రీడలో చేరానన్నారు. టోర్నీలో క్రీడాకారులు మెరుగైన ప్రదర్శన కనబరచాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ఖోఖో సంఘం ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి మాట్లాడుతూ ఖోఖో క్రీడలకు గత కొన్నేళ్ల నుంచి చాలా ప్రాచుర్యం లభిస్తుందని, 54 దేశాల్లో ఖోఖో ఆడుతున్నట్లు వివరించారు. వచ్చే ఏడాది జనవరి 13 నుంచి 19 వరకు న్యూఢిల్లీలో వరల్డ్ కప్ ఓపెన్ ఖోఖో చాంపియన్‌షిప్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో 34 దేశాల జట్లు పాల్గొంటాయని, రాష్ట్రస్థాయి ఖోఖో టోర్నీలో ప్రతిభ చాటాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మణ్ సింగ్, జిల్లా కబడ్డీ సంఘం కోశాధికారి ఉమామహేశ్వర్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ఖోఖో సంఘం ప్రధాన కార్యదర్శి జీపీ విలియం, టీజీ పెటా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దూమర్ల నిరంజన్, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, జిల్లా వాలీబాల్ సంఘం ప్రతినిధి చెన్నవీరయ్య, జిల్లా యోగా సంఘం కార్యదర్శి బాలరాజు, దత్తు, పీడీలు గజానంద్‌కుమార్, నిరంజన్‌యాదవ్, రిటైర్డ్ పీడీ శ్రీనివాసులు, సోహైల్, రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్

తొలిరోజు ఫలితాలు..

బాలుర విభాగంలో వరంగల్ జట్టు 28- 20 పాయింట్ల తేడాతో ఖమ్మం జట్టుపై, రంగారెడ్డి జట్టు 16- 14 తేడాతో కరీంనగర్ జట్టుపై, ఆదిలాబాద్ జట్టు 28- 24 పాయింట్ల తేడాతో నల్లగొండ జట్టుపై గెలుపొందాయి. బాలికల విభాగంలో హైదరాబాద్ జట్టు 12- 10 పాయింట్ల తేడాతో ఖమ్మం, నల్లగొండ జట్టు 26- 10 తేడాతో కరీంనగర్‌పై, ఆదిలాబాద్ జట్టు 19- 6 పాయింట్ల తేడాతో వరంగల్ జట్టు విజయం సాధించాయి.

శుభారంభం చేసిన పాలమూరు

ఆతిథ్య పాలమూరు బాలికల జట్టు శుభారంభం చేసింది. జిల్లా బాలికల జట్టు 18- 8 పాయింట్ల తేడాతో మెదక్‌పై విజయం సాధించింది. బాలుర విభాగంలో జిల్లా బాలుర జట్టు ఓడిపోయింది. మెదక్ జట్టు 12- 6 పాయింట్ల తేడాతో మహబూబ్‌నగర్ జట్టుపై గెలుపొందింది.

యువకుడి మృతదేహంతో ఆందోళన


కల్వకోల్‌లో జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టిన గ్రామస్తులు

- హత్య చేసి.. ఆత్మహత్యగా చిత్రీకరించారని కుటుంబసభ్యుల ఆరోపణ
- పెద్దకొత్తపల్లి మండలం కల్వకోల్‌లో ఉద్రిక్తత

పెద్దకొత్తపల్లి: మండలంలోని కల్వకోల్‌లో శనివారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన పట్నం శివ (21) మృతదేహంతో సోమవారం బాధిత కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. కొందరు పథకం ప్రకారం శివను హత్యచేసి, ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని ఆరోపిస్తూ 167కే నంబర్ జాతీయ రహదారిపై ధర్నా చేపట్టారు. తమ బిడ్డ మృతికి కారకులైన వారిని తమకు అప్పగించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబ సభ్యుల ఆందోళనలో గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొనడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. డీఎస్పీ శ్రీనివాస్ యాదవ్, సీఐ మహేష్ పోలీసు సిబ్బందితో అక్కడికి చేరుకొని ఆందోళనకారులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. దాదాపు 3 గంటలపాటు చేపట్టిన ధర్నాతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ఈ క్రమంలో వాహనాలను దారి మళ్లించారు. రాత్రి వరకు హైవేపై ధర్నా చేపట్టిన బాధిత కుటుంబ సభ్యులు.. ఆ తర్వాత గ్రామంలోకి మృతదేహాన్ని తీసుకెళ్లి ఆందోళనకు దిగారు. శివ మృతిపై సమగ్ర విచారణ జరిపించి, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

సౌత్‌జోన్ పోటీలకు పీయూ విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ కబడ్డీ పురుషుల జట్టు చైన్నైలోని ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో జరిగే సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొనేందుకు సోమవారం బయలుదేరారు. ఈమేరకు విద్యార్థులను పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్ అభినందనలు తెలిపి, ట్రాక్‌సూట్‌లు యూనిఫాంలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ పూర్తిస్థాయి ప్రతిభ కనబర్చి పీయూకు మంచి విజయాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి, పీడీ శ్రీనివాస్, కురుమూర్తి, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి సతీమణి ప్రత్యేక పూజలు



జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ ఆలయాలను సోమవారం కేంద్ర మంత్రి కుమారస్వామి సతీమణి అనిత దర్శించుకున్నారు. ఈఓ పురేందర్‌కుమార్, చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, అర్చకులు స్వాగతం పలికారు. ముందుగా బాలబ్రహ్మేశ్వరుడికి ఏకవార రుద్రాభిషేకం, జోగుళాంబ అమ్మవారికి కుంకుమార్చన చేశారు. దేవస్థానం వారు ఆమెకు అమ్మవారి జ్ఞాపిక, తీర్థ, ప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనం చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మ, పాలకమండలి సభ్యులు సరస్వతి, కుర్వ గోపాల్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జోగుల రవి పాల్గొన్నారు.

శ్రీశైలం రహదారిపై చిరుత సంచారం

మన్ననూర్: అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యం పరిసర ప్రాంతం శ్రీశైలం- హైదరాబాద్ ప్రధాన రహదారిలో యాత్రికులకు చిరుత కనిపించింది. సోమవారం శ్రీశైలం పుణ్యక్షేత్రం దర్శించుకుని తిరుగు ప్రయాణంలో ఉన్న యాత్రికుల కారు ముందు నుంచి చిరుత రోడ్డు దాటుతూ కనిపించింది. దీంతో ఒక దశలో ఆందోళన చెందిన వారు.. వెంటనే తేరుకొని చిరుత సంచారాన్ని సెల్‌ఫోన్‌లో బంధించారు. ఈ విషయమై ఎఫ్‌డీఓ రామ్మూర్తి స్పందిస్తూ పెద్ద పులులు, చిరుతలు, ఇతర వన్య ప్రాణులు తమ ఆవాసాల్లో సంచరించడం కొత్తేమి కాదన్నారు. రిజర్వు ఫారెస్టులో పెద్ద పులులు, చిరుతలతోపాటు వన్యప్రాణుల సంఖ్య ఆశించి స్థాయిలో పెరగడంతో నల్లమల ప్రాంతానికి తరుచుగా వచ్చే పర్యాటకులు, ప్రయాణికులకు అప్పుడప్పుడు తారసపడుతుంటాయని చెప్పారు.

పీయూ సామగ్రి లెక్క తేలుస్తున్న అధికారులు


రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డికి ఫిర్యాదు చేసిన పీయూ విద్యార్థి సంఘాల నాయకులు

సాక్షి ఎఫెక్ట్..

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో గత వైస్ చాన్స్‌లర్ హయాంలో కొనుగోలు చేసిన కంప్యూటర్లు, ఏసీలు, కూలర్లు, ఫర్నిచర్ ఇతర సామగ్రి లెక్కలు తేల్చే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. పీయూలో సామగ్రి పక్కదారి పట్టిన విషయంపై ఇటీవల 'సాక్షి'లో ప్రత్యేక కథనాలు వెలువడ్డాయి. ఈ క్రమంలో కొన్నేళ్లుగా ఏఏ వస్తువులు కొనుగోలు చేశారు.. ప్రస్తుతం ఏ వస్తువులు ఉన్నాయి.. ఏమైనా వస్తువులు పక్కదారి పట్టాయా అనే అంశాలపై లెక్కలు తీయాలని పీయూ అధికారులు వివిధ కళాశాలలకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ఈ మేరకు పీయూ పీజీ సైన్స్, ఆర్ట్స్ కళాశాలలు, బాలుర, బాలికల హాస్టళ్లు, ఫార్మసీ కళాశాల, లైబ్రరీ, ఎంఈడీ కళాశాల, స్పోర్ట్స్ భవనంతో పాటు ఎగ్జామినేషన్ బ్రాంచ్‌లో సామగ్రి లెక్కలు తీసే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు. చాలా చోట్ల సామగ్రి కొనుగోలుకు సంబంధించిన రికార్డులు లేవని.. కేవలం ప్రస్తుతం ఎన్ని వస్తువులు ఉన్నాయనే లెక్కలు మాత్రమే ఉన్నట్లు తెలుస్తోంది. కళాశాలలు, కార్యాలయాల్లో వస్తువులు వచ్చినప్పుడు ఎంట్రీ చేయకుండా అడ్డగోలుగా రికార్డులు నిర్వహించడంతో లెక్కలు సరిగ్గా లేనట్లు తెలిసింది.

మాజీ వీసీపై ఫిర్యాదు..

పీయూ మాజీ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ తన హయాంలో అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని.. సమగ్ర విచారణ జరిపించాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డికి ఫిర్యాదు చేశారు. పీయూలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు తీసుకున్నారని ఆరోపించారు. అంతేకాకుండా పీయూతో పాటు అనుబంధ పీజీ కళాశాలల పేరు మీద పెద్ద సంఖ్యలో కంప్యూటర్లు, ఏసీలు, వాటర్ ఫిల్టర్‌లు, సోలార్ విద్యుత్ పరికరాలు, సోఫాసెట్లు, బెడ్లు ఇతర ఫర్నిచర్, ప్రొజెక్టర్‌లు, ప్లాస్టిక్ చైర్‌లు, విద్యుత్ పరికరాలు కొనుగోలు చేసి, మాయం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు కావాల్సిన బంధువులకు వీసీ భవనంతో ఉద్యోగాలు ఇవ్వగా.. పెద్దఎత్తున వేతనాలు ఇస్తున్నట్లు తెలిపారు. యూనివర్సిటీలో జరిగే పలు పనుల్లో టెండర్లు వేయకుండా, నేరుగా పనులు చేపట్టి బిల్లులు తీసుకున్నారన్నారు. వీటితో పాటు పీయూలో పెరిగిన టేకు చెట్లను కొట్టి సొంత పనులకు వినియోగించారని, స్పోర్ట్స్ విభాగంలో ఎటువంటి గేమ్స్ నిర్వహించకుండా డబ్బులు తీసుకున్నారన్నారు. వాటన్నింటిపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించి, కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా నిర్మాణ బాధ్యుడు రాము, జేఏసీ చైర్మన్ ప్రకాష్, వెంకటేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డీడీఎన్‌ఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక


డీడీఎన్‌ఎస్ ఉమ్మడి జిల్లా కార్యవర్గానికి నియామక పత్రం అందజేస్తున్న రాష్ట్ర ప్రతినిధులు

స్టేషన్ మహబూబ్‌నగర్: రంగారెడ్డి జిల్లా తుర్కయంజల్‌లో సోమవారం జరిగిన రాష్ట్ర దూప, దీప, నైవేద్య అర్చక సంఘం సమావేశంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా జీ.రవికుమార్ (మహబూబ్‌నగర్), ఉపాధ్యక్షుడిగా అశోకాచార్యులు (జోగుళాంబ గద్వాల), కార్యదర్శులుగా జోషి రామాచారి (నారాయణపేట), అరవిందాచార్యులు (నాగర్‌కర్నూల్), శ్రీధరాచార్యులు (వనపర్తి), కోశాధికారిగా జీ.సత్యనారాయణ (నాగర్‌కర్నూల్), సంప్రదాయ కార్యదర్శిగా పవనకుమారాచార్యులు (మహబూబ్‌నగర్), ప్రధాన సలహాదారులుగా నరసింహాచార్యులు (నారాయణపేట), ప్రచార కార్యదర్శిగా శ్రీహరిచార్యులు (వనపర్తి), సంయుక్త కార్యదర్శులుగా శేఖరయ్య (జోగుళాంబ గద్వాల), అరవింద్ కుమార్ (నాగర్‌కర్నూల్)లను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి డీడీఎన్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దౌల్తాబాద్ వాసుదేవశర్మ, కార్యదర్శులు ప్రసాద్‌శర్మ, తాపాల వెంకటాద్రి తదితరులు నియామక పత్రం అందజేశారు.

తగ్గిన వరద ప్రవాహం

ధరూరు/దోమలపెంట/రాజోళి: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో తగ్గింది. సోమవారం సాయంత్రానికి 31వేల క్యూసెక్కులుండగా.. క్రస్టు గేట్లను మూసివేసినట్లు అధికారులు తెలిపారు. జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో 11 యూనిట్లను కొనసాగించి విద్యుదుత్పత్తి చేస్తున్నారు. ఇందుకోసం 30,559 క్యూసెక్కుల నీటిని వినియోగించు కుంటున్నారు. నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 71 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 1,140 క్యూసెక్కులు, కుడి కాల్వకు 730 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 50 క్యూసెక్కులు సమాంతర కాల్వకు 400 క్యూసెక్కులు, భీమా లిఫ్టు- 2కు750 క్యూసెక్కులు మొత్తం ప్రాజెక్టు నుంచి మొత్తం 33,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 9.357 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

- శ్రీశైలం జలాశయంలో సోమవారం నీటిమట్టం 883.9 అడుగుల వద్ద 209.1579 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాల, సుంకేసుల నుంచి 30,577 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ఎడమగట్టు భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 36,600 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 30,879 మొత్తం 67,479 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు.
- సుంకేసుల డ్యాంకు 13,930 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. మూడు గేట్లను తెరిచి 11,072 క్యూసెక్కులు, కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులు వదిలినట్లు జేఈ మహేంద్ర తెలిపారు.

బియ్యం తరలిస్తున్న డీసీఎం పట్టివేత

గద్వాల క్రైం: రేషన్ బియ్యం తరలిస్తున్నారన్న అనుమానం మేరకు సోమవారం డీసీఎంను అదుపులోకి తీసుకున్నట్లు పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్ కుమార్ తెలిపారు. రాయచూర్ నుంచి గద్వాల మీదుగా ఎర్రవల్లి వైపు 362 ప్లాస్టిక్ సంచుల్లో బియ్యం తరలిస్తుండగా.. పట్టుకొని పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై సివిల్‌సప్లై అధికారులకు సమాచారం అందించామని.. వారి నివేదికల ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయన్నారు. పట్టుబడిన డీసీఎంలోని బియ్యం శాంపిల్స్‌ను సివిల్‌సప్లై సిబ్బంది బ్రహ్మయ్య, మహర్షి సేకరించినట్లు తెలిపారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో బంగారు నగల చోరీ

జడ్చర్ల: పట్టణంలోని కొత్తబస్టాండ్‌లో ప్రయాణికురాలికి సంబంధించిన బంగారు నగలు గల బ్యాగును అపహరించిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం కథనం ప్రకారం.. జనగామ జిల్లాకేంద్రానికి చెందిన కాసం ఉపేంద్ర తన భర్త ఆంజనేయులుతో కలిసి పది రోజుల క్రితం ఏపీలోని కర్నూలులో ఉన్న తమ పెద్ద కూతురు దగ్గరకు వెళ్లారు. తిరిగి సోమవారం హైదరాబాద్‌కు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులో బయలుదేరగా.. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో భోజనం నిమిత్తం జడ్చర్ల కొత్త బస్టాండ్‌లో బస్సు ఆపారు. అయితే నగల బ్యాగును సీటు వద్ద ఉంచి హోటల్‌లో తినడానికి తీసుకునేందుకు వెళ్లి వచ్చి చూడగా బ్యాగు కనిపించలేదు. బ్యాగులో బంగారు నాను, నల్లపూసల దండ, పుస్తెలతాడు, ఉంగరంతోపాటు కొంత నగదు ఉందని, వీటి విలువ మొత్తం రూ.2.80 లక్షలుగా ఉంటుందని బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రూ. 2.5లక్షల నగదు అపహరణ

మక్తల్: పట్టపగలు గుర్తుతెలియని వ్యక్తులు బైకు కవర్‌లో పెట్టిన రూ.2.50 లక్షల నగదు ఎత్తుకెళ్లిన సంఘటన మక్తల్ బస్టాండ్‌లో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలిలా.. మాగనూర్ మండలం వడ్వాట్ గ్రామానికి చెందిన సుందరయ్యశెట్టి మక్తల్‌లోని ఎస్‌బీఐలో రూ.2.50 లక్షల నగదు డ్రా చేసుకుని బైకు ముందు ఉన్న కవర్‌లో పెట్టి బస్టాండ్‌లో ఓ షాపు దగ్గరకు వెళ్లాడు. తిరిగి వచ్చి చూడగా కవర్ మాత్రమే ఉండి డబ్బులు లేకపోవడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి బస్టాండ్‌లో సీసీ పుటేజీలను పరిశీలించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


అనిల్ (ఫైల్)

బల్మూర్: మండలంలోని కొండనాగులలో సోమవారం రాత్రి ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. గ్రామానికి చెందిన కమ్మరి ధన్‌రాజ్ కుమారుడు అనిల్(20) సోమవారం సాయంత్రం స్థానిక కల్లు దుకాణం వద్ద అచేతన స్థితిలో పడి ఉన్నాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో తమ కుమారుడు కల్లు తాగడంతోనే మృతిచెందాడని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు కల్లు దుకాణం వద్ద మృతదేహాన్ని ఉంచి ఆందోళన చేపట్టి.. కల్లు సీసాలు, పెట్టెలు ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న అచ్చంపేట సీఐ రవీందర్ అక్కడికి చేరుకొని యువకుడి మృతికి గల కారణాలు తెలుసుకొని న్యాయం చేస్తామని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

అడ్డాకుల: మూసాపేట మండల వేములకి చెందిన వివాహిత పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ పి.శ్రీనివాసులు తెలిపారు. భూత్పూర్ మండలం వెల్కిచర్లకు చెందిన శివమ్మ(45)ను కొన్నేళ్ల కిందట మూసాపేట మండలం వేముల గ్రామానికి చెందిన ఆవుల అంజనేయులుకు ఇచ్చి వివాహం చేశారు. వారికి ఇద్దరు కుమారులు ఉండగా.. పెద్ద కుమారుడికి పచ్చకామెర్లు రావడంతో వైద్యం చేయించేందుకు ఈ నెల 24న వనపర్తి జిల్లా గోపాల్‌పేటకు తీసుకెళ్లింది. అక్కడి నుంచి వచ్చే క్రమంలో ఆమె తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకుంది. ఇంటికి వచ్చిన తర్వాత ఎన్నిసార్లు ఫోన్లు పోగొడతావని భర్త మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన శివమ్మ ఈనెల 26న సాయంత్రం ఇంటి వద్ద ఎవరు లేని సమయంలో పురుగు మందు తాగింది. ఆలస్యంగా గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 27న మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలి సోదరుడు బొజ్జ వెంకటయ్య సోమవారం ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.